
# స్టాప్

కొలకలూరి



[illegible]టర్మినస్‌లో బస్ బయలుదేరే టప్పుడు అతను వచ్చి కూర్చుని డ్రైవరుకు చూపించాడు స్త్రీని. ఆమె చంకలో పదినెలల ఆడపిల్లవుంది. చేయి పట్టుకొని రెండేళ్ల పిల్లవాడు, రోడ్డుకడ్డంగా నడుస్తూ మూడున్నరేళ్ల పిల్లవాడు వస్తూ పోతూవున్న బస్సులు కారులు సినీమా బొమ్మలుచూస్తూ నడుస్తున్నాడు అయిదేళ్లవాడు.

స్టార్ట్ చేసిన ఇంజను దడదడలాడుతూ వుంటే, ఆమె దడదడలాడుతూ ముగ్గురు పిల్లల్నీ అటూఇటూ నెట్టుకొంటూ గొర్రెల్ని తోలుకు వస్తున్న పిల్లవాడిలాగా, కాకులకూ, గద్దలకు బలి కాకుండా పిల్లల్ని రక్షించే తల్లికోడిలాగా కంగారుపడుతూ వచ్చిందిఆమె.

చంకలో పిల్ల చంకలోనేవుంది. మూడో వాణ్ణి నగల పెట్టెను పెట్టినట్లు బస్సులో పెట్టింది. పొయిమీదనుంచి దించుతుంటే కాలిన పులుసు పాత్రను వదిలినట్లు రెండో వాణ్ణి బస్సులో వదిలింది. బియ్యం బస్తా కూలీలు రైలులోనో, లారీలోనో పడేసినట్టు మొదటివాణ్ణి బస్సులో పడేసింది. చంకలో పిల్లతో అతి కష్టంమీద బస్సులోకి స్థూలకాయం చేర్చి డ్రైవర్ ప్రక్క ఖాళీగా వున్న ఫోర్ సీటర్‌వైపు కాళ్లతో చేతులుతో పిల్లల్నీ నెట్టుకొంటూ వెళుతున్నప్పుడు బస్సు బయలుదేరింది. ఆమె పడబోయి, కూర్చోబడింది సీటులో. పిల్లలు ముగ్గుర్నీ ముందు కూర్చోబెట్టుకొంది. చంకలో పాప ఒళ్లోకివచ్చింది.

ఆమె స్థూలంగావుంది. శరీరంలో ప్రతి అవయవం అవసరమున్నంతకంటే అధికంగా పెరిగింది. కూర్చుని ఒక్క నిట్టూర్పు విడిచి అతనివైపు చూచింది. అప్పుడతను టిక్కెట్లు తీసుకొంటున్నాడు. ఆమె అతనిభార్య కావచ్చునని ఎవరికయినా అనిపిస్తుంది. ఆమె ఆ పిల్లలతల్లి అనీ అనిపించవచ్చు. అతను భర్త, తండ్రి అనీ అనిపించవచ్చు. అయితే అతనిలో తండ్రి కుండవలసిన లక్షణాలు ఏమేమున్నాయో అనీ అనిపిస్తుంది. భార్యా భర్త లిద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. 'సరిగ్గా కూర్చో' అని ఆమె మొదటివాణ్ణిమాత్రం హెచ్చరించింది.

మొదటి బస్‌స్టాప్‌లో యువతి ఎక్కింది. లేడీస్ సీటు ఖాళీగా లేకపోతే ముందుకు వచ్చింది. వస్తూ అతన్ని చూచింది. చూచిన చోటే ఆగిపోయింది. ఆగిపోయి చూస్తూ వుంది. కండక్టరు ముందుకు పొమ్మని అరిచింతర్వాత ముందుకు వచ్చి ఖాళీవున్న చోట కూర్చుంది.

ఇవతలప్రక్క కిటికీ దగ్గరగా కూర్చున్న యువతి మూడుసీట్లు వెనుక అవతలప్రక్క కిటికీ దగ్గర కూర్చునివున్న అతన్ని చూచింది చూస్తూ వుండిపోయింది. మెడ వెనక్కు నొప్పి పుట్టేటట్లుగా పెట్టి చూస్తూవుంది.

బస్సులో ఉన్నవాళ్లు కొందరామె చూపును చూశారు. కొందరతని చూపును చూశారు. ఒకర్నిమార్చి ఒకర్ని బస్సులో అందరూ చూశారు. వాళ్లు చూచుకొంటూవున్నారు. వీళ్లు చూస్తూవున్నారు.

సిటీబస్ రెండోస్టాప్‌లో ఆగింది. ఎవరూ దిగలేదు. ఇద్దరో ముగ్గురో ఎక్కారు. కండక్టరు విజిల్ వూదాడు. బస్సు బయలు దేరింది. వాళ్లు చూచుకొంటూ ఉన్నారు.

పిల్లలతల్లి భర్తను చూచింది. అతను ఆమెను గమనించలేదు. యువతిని చూచింది. ఆమెకూడా చూడలేదు. అటూ ఇటూ ఇద్దరి వైపూ చూచింది. ఎవరూ చూడలేదు.పిల్లల వైపు చూచింది. పెద్దవాడు బైటికి చూస్తున్నాడు. రెండోవాడు బస్సు కుదుపుకు కునుకుతున్నాడు. మూడోవాడు తల్లి ఎటుచూస్తే అటు చూస్తున్నాడు. ఆమె రోడ్డుమీదికి చూడసాగింది. బస్సు వేగంగా పోతూవుంది.

వాళ్లిద్దరూ పరస్పరం చూచుకొంటూ వున్నారు. కండక్టరు రోజుకు కొన్ని వందల మంది స్త్రీ పురుషుల్ని చూస్తుంటాడు. ఎవరినీ ఇంతసేపు చూచిన గుర్తు లేదు. ఇద్దరినీ చూస్తూ విజిల్ ఇవ్వటం మర్చిపోతే స్టాప్‌లో దిగవలసిన మనిషి గోలచేసి బస్సు ఆగేటట్లు చూచుకొన్నాడు.

ఎంతకీ బస్సు బయలు దేరటానికి విజిల్ ఇవ్వకపోతే వెనక్కుతిరిగి చూచిన డ్రైవర్ యువతినీ, అతన్నీ చూస్తూన్నప్పుడు వెనుక బస్ హారన్ విన్నాదాకా బస్సు స్టార్ట్ చేయలేదు. రెండోవాడు మళ్లీ కునుకుతుంటే భర్తనూ,ఆమెనూ వాళ్ల చూపులనుచూస్తూ వున్న పిల్లలతల్లి, తట్టి లేపి 'నాన్న దగ్గరకు పో' అని పంపించింది. వెడుతున్న

బస్సులో వెళుతున్న పసివాడు కుదుపులకు అటవుతూ ఇటవుతూ తండ్రి దగ్గరకు చేరుకొన్నాడు.

తండ్రి సుడిగాలి వచ్చి దుమ్ము పడితే విదిలించుకొన్నట్టుగా కళ్ళాపి కొడుతుంటే వెనక్కు తగ్గినట్లు పసివాణ్ణి దగ్గరకు రానీయకుండా వ్రేళ్లతో వాడిచేయి పట్టుకొని, పో పో అన్నట్లుగా ముందుకు పంపించాడు. వాడు బిక్కముఖం వేసి, మళ్లీ వచ్చిన తోవనే పడుతూ లేస్తూ తప్పటడుగులు వేసుకొంటూ,ముక్కు తుడుచుకొంటూ ముందుకు వెళుతుంటే, యువతి రెండు చేతులూ చాచి, వాణ్ణి పైకెత్తి తన ప్రక్క కాళీవున్నచోట కూర్చోబెట్టింది. వాడు అమ్మవైపు రెండుసార్లు, నాన్నవైపు ఒకసారీ చూచి, ఆమె ముఖంలోకి 'ఎవరు నువ్వు' అన్నట్లుగా చూశాడు. యువతి వాడి కళ్లలోకి తీయగా చూచి, ముక్కు తుడిచి, మూతి తుడిచి, మళ్లీ పైకెత్తి వళ్లో కూర్చోబెట్టుకొంది.

వాడీసారి అమ్మా నాన్నల అనుమతికోసం అటూ ఇటూ చూడలేదు

యువతి కట్టుకున్న అందమయిన చీరె నలిగిపోతుందేమోనని చూస్తున్నవాళ్లకే అనిపించింది. ఆమె వయస్సు పాతిక దాటదు. ముఖంలో అలసట, బలహీనత లేవు. ఆరోగ్యంగా పుష్టిగావుంది తల్లోపూలు, నుదుటి కుంకుమ కనిపిస్తుంది. కాని మెళ్లో తాళి చూడలేదు.

# స్టాప్

పసివాణ్ణి ఆ చెంపా ఈ చెంపా హడావుడిగా ముద్దు పెట్టుకొంది. వాడేమీ అభ్యంతరం చెప్పలేదు. మెదలకుండా వూరుకొన్నాడు. 'నీ పేరేం పేరు బాబు!' అంది. వాడేదో గొణిగాడు. ఆమె వినిపించుకొన్నట్లు లేదు. వెంటనే వెనక్కు చూచింది అతను చూస్తూ వున్నాడు.

అతని వయస్సు ఇరవై ఎనిమిది దాటదు సన్నగా బారుగా ఉన్నాడు. వేసుకొన్న టక్, దువ్వుకొన్న తల చెరిగిపోలేదు. నీటుగా వున్నాడు. ఆమెవైపు చూస్తూనేవున్నాడు. యువతి ఒళ్లో కూర్చున్న పిల్లవాణ్ణి తల్లిగాని తండ్రిగాని తీసుకోలేదు. తీసుకొనే ప్రయత్నమూ చేయలేదు.

బైటికి చూస్తున్న మొదటివాడు అట్లాగే కునుకుతున్నాడు. వీడు నిద్రకు పడితే కష్టం దించుకుపోవటం—అనుకొందో ఏమో తట్టి లేపింది. వాడు కోపంగా ఆమెను నఖశిఖ పర్యంతం చూచి విసురుగా తల తిప్పుకొని మళ్లీ బైటికి చూస్తున్నాడు

మగపిల్లలు ముగ్గురూ ఆకారంలో తండ్రి పోలిక. తండ్రి చిన్నతనంలో మొదటివాడి లాగా వుండి ఉంటాడని ఎవరికయినా అనిపిస్తుంది. నా దగ్గరకు రావద్దు నన్ను తాకవద్దు అన్నట్లుగావుంది ఇద్దరి వాలకం! ఈ అయిదేళ్లవాడు ఇరవై అయిదేళ్లవాడు అయితే అచ్చంగా తండ్రిలాగా ఉంటాడు, తండ్రిలాగా ప్రవర్తిస్తాడు అనిపిస్తుంది.

మూడోవాడు, మొదటివాణ్ణి అన్నా అన్నా అంటూ నిక్కరు పట్టుకొని లాగాడు. వాడు బైటికిచూస్తూ కనీసం వెనక్కయినా తిరిగి చూడకుండా మూడోవాణ్ణి విదిలించివేశాడు. వాడు బిక్కముఖంవేసి,పెదవి విరిచి, బుగ్గలు గీతలు పడేలాగా అవురుమని ఏడ్చాడు. 'లేదులే లేదులే' అంటూ ఆమె వాణ్ణి సముదాయిస్తున్నప్పుడు, నిద్రపోతున్న ఒళ్లోపాప లేచి కేర్ కేర్‌మని ప్రారంభించింది. 'చిచ్చుచ్చుచ్చుచ్చూ' అని ఫ్యాక్టరీ ధ్వనివంటిది—ఆమె సముదాయించ బోయింది,

ఇద్దరు పిల్లల గోల, తోడు తల్లి అల్లరి, బస్సు రద్దిలోనూ వినబడుతుంటే అంత దాకా యువతినో, అతన్నో చూస్తున్న జనం ఇప్పుడామెను చూడసాగారు. యువతి అతని వైపు చూచింది. చూస్తున్నప్పుడామెకళ్ళు కించిన్నిమీలితాలై, కనుబొమలు వంగాయి. ఆ క్షణంలో అతను వెలుపలికి చూశాడు. ఆమె దృష్టి మరల్చుకొంది.పసివాణ్ణి పైకెత్తి బుగ్గలు నిమురుతూ ముక్కు ముద్దుపెట్టుకొంది.

తల్లి ఏడుస్తున్న పసివాణ్ణి వోదార్చి వూరుకోబెట్టింది. పసిపాప ఏడ్పు రెట్టింపు చేసింది. చేతులుమీద అటూ ఇటూ వూపింది. పాప ఏడ్పు ఆపలేదు. అధికం చేసింది ఏం చేయనండీ అన్నట్లుగా భర్త వైపు చూచింది. అతను చూడటంలేదు. ఆమెవైపు చూస్తున్నాడు. ఆమె అతన్ని చూడటంలేదు. పిల్లవాణ్ణి వూరికే ముద్దు పెట్టుకొంటూ వున్నది.

తల్లికి ఏం చేయాలో తెలియలేదు. ఏదో స్టాప్‌లో బస్ ఆగింది. ఆగినప్పుడు గోల ఎక్కువగా వినిపించినట్లయింది. వాళ్లు డ్రైవర్ దగ్గర ఉండటంవల్ల డ్రైవర్ అసహనంగా వాళ్లవైపు చూచి కోపంగా స్టార్ట్ చేశాడు బస్సును.

ఒకరో ఇద్దరో దిగిపోయారు. ఒకరో ఇద్దరూ ఎక్కారు. పాప ఏడ్పుకంటే డ్రైవరు చూపు ఆమె భరింపలేకపోయిందేమో పాపను అడ్డం వేసుకొంది. పాలిస్తూ వుంది. డ్రైవర్ ఆమె వైపు చూచి కోపం మానుకొన్నాడు. ఇద్దరు ముగ్గురు యువకులు ఉత్సాహంగా ఆమెవైపు చూస్తున్నారు. నలుగురు అయిదుగురు మగవాళ్లు పెద్దవాళ్లు ఆమెవైపు చూడటం మాను



కొన్నారు. తల తిప్పుకొన్నారు.

యువతి, అతన్ని చూడటం లేదు. తల్లిని పాలు తాగుతున్న పిల్లని, పిల్ల పాల బుగ్గల్ని, పెదాల మీద నుంచి జారుతున్న పాల బొట్లనూ చూస్తూ వుండిపోయింది. చేతుల్లో ఉన్న పిల్లవాడి సంగతి, వాడి చేయి తగిలి జారిపోయిన పైట సంగతి ఆమెకు గుర్తులేదు.

యువతి, తన వైపు చూడకుండా ఉన్నప్పుడు తన నెవరయినా చూస్తున్నా రను కొన్నాడేమో అటూ, ఇటూ చూశాడు. తన నెవరూ చూడటం లేదు కానీ ముగ్గురు యువకులు ఆమె వైపు చూస్తుంటే పైట సరిగా వేసుకో అని కూర్చున్న చోటు నుంచే అతను చెప్పాడు. ఆమె అటూ ఇటూ చూచి, హడావుడిగా పైటచెంగు తీసి పాప తలమీదుగా కప్పింది. ఆమె వైపు చూడటం మానుకొన్న యువతి తన పైట చెంగు జారిపోయిన సంగతి గుర్తించి, వెంటనే సరి చేసుకొంది. వెనక్కు తిరిగి అతన్ని చూసింది. అప్పుడామె పెదాలు వ్యాకోచించినట్లుగా సాగి, తక్షణం కుంచించుకు పోయాయి.

అతను నిటారుగా కూర్చున్నాడు. ఏదో దిగ మింగినట్లు కంఠం కదిలింది. తల్లి ప్రక్కనే కూర్చుని పాప పాలు తాగుతుంటే చూస్తున్న మూడోవాడు ఒట్టి నోరు తడి అయితే చప్పరించటం చూస్తూ వుంది యువతి.

మొదటివాడు బైటికి చూస్తూ అలాగే కిటికీలో తలపెట్టి నిద్రపోయాడు. తల్లి వాణ్ణి చూసింది. అటూ ఇటూ చూచింది. డ్రైవరు తిన్నగా రోడ్డు మీదికి చూస్తున్నాడు. ఒకరిద్దరు యువకులు తనవైపు చూస్తున్నారు. అనుకోకుండా భర్త ఆమె వైపు చూశాడు.

వీడు నిద్ర పోతున్నాడు చూడండి ఏం చేసేది నేను. వీళ్ళతో వేగటం ఎట్లాగంటా అన్నట్లుగా చూచింది. భర్త గిల్లమన్నట్లుగా సైగ జేశాడు. అతను చేసిన ఆ సైగ, అందువల్ల కలిగిన శారీరకమైన కదలిక, అప్పుడతని ముఖం చూచి, యువతి, ముఖం వంచుకొని ముంగురులు ఒళ్ళో వున్న పిల్లవాడికి తగిలేటట్లు, తనలో తను నవ్వుకొంది.

తల్లి మొదటివాణ్ణి మోచేతిమీద

వాడు నిద్రలేచి సరిగా కూర్చునేటట్లు ఎంత అవసరమో అంత గట్టిగా గిల్లింది. యువతి చూస్తూ వుంది. వాడు ఉలిక్కిపడి నిద్ర లేచాడు. కళ్ళు మూస్తూ తెరుస్తూ అటూ ఇటూ చూశాడు. ఊ! ఊ! అంటూ తల ఎగుర వేశాడు. వూ? వూ? అని ప్రశ్నించాడు. పసివాడు వూపుతున్న తల, గిల్లమని పంకించిన తల— రెంటిలో ఏదో సమాన ధర్మం గోచరించి, సమన్వయ తాపత్రయంలో యువతి వుంది.

మోచేయి మీద మంటగా వుండటం తెలుసుకొన్నాడు, చూచుకొన్నాడు. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కోపంగా చూశాడు. ఆ చూపు ఎంతో అందంగా వుంది. నువ్వెవరివి నన్ను నిద్రలేపటానికి, నా సొంత జీవిత పరిధిలోకి వచ్చి, నన్ను కలత పరచి భంగపరచి, వ్యాకులపరిచి, నిద్రాభంగంచేసి, స్వప్నచ్యుతి చేసి, నన్ను మేల్కొలిపే అధికారం నీ కెవరిచ్చారు. ఎప్పుడో అయిదేళ్ల పూర్వం నన్ను కన్నందువల్ల, నో ఏడాది పాటు పాలిచ్చినందువల్ల, రోజూ తిండి పెడుతున్నందువల్ల, నన్నక్కడికి తీసుకు వెళ్ళి తీసుకు వస్తున్నందువల్ల, నా జీవితావధిలోకి వచ్చి, నా గిరిలోకి ప్రవేశించి, నన్ను కదిలించే అధికారం నీకే వుంది అన్నట్లుగా ఆ చూపు ఉంది అని యువతి అనుకొంది.

ఎవరు నన్ను గిల్లింది. నువ్వా నాన్నా అన్నట్లుగా చూశాడు. నేనే గిల్లాను. మళ్లీ నన్ను గిల్లవద్దు. నీ గోళ్ళు అసలే ముళ్ళ

> **కొత్తిమిరి చిట్కా**
>
> కొత్తిమీరి మితిమీరి వాడక్కర లేదు. శుభ్రంగా కడిగిన కొత్తిమీరి కట్ట ప్లాస్టిక్ బాగ్‌లో పెట్టి ఉంచితే సరి—నాలుగైదు రోజులైనా ఎండిపోదు. కావలసినప్పుడు—రెండు కొసలు కత్తిరించి చారలో, సాంబారులో పెరుగు పచ్చళ్లలో వేసుకో వచ్చు. కొందరు కట్ట నీళ్లలో ఝాడించి అలాగే పడేస్తారు. శుద్ధ దండుగ. కొంచెం వేసినా ఎక్కువ వేసినా కొత్తిమిరి సువాసన వేస్తుంది.

అన్నట్లుగా వెనక్కు జరిగి, అందకుండా వుంటాననుకొన్నట్లుగా కూర్చుంది తల్లి.

నువ్వు నన్ను గిల్లావు. నువ్వెవరివి నన్నా కానీయ్. నన్ను గిల్లే అధికారం నీకు లేదు. దెబ్బకు దెబ్బ అంతే అన్నట్లుగా ఆమెను గిల్లబోయాడు. అకస్మాత్తుగా బస్సు కుదుపుతో ఆగింది. ముందుకు వంగి తల్లిని గిల్ల బోతున్న వాడు, కిటికీకి తగిలి సీటులో కూర్చోబడ్డాడు.

అంతదాకా వెలుపలికి రాని ఏడ్పు, ధ్వని రూపం పొందింది. అపురు మని ఏడ్చాడు. ఆ ఏడ్పు తల్లి గిల్లిందనే బాధవల్ల కొంత, మళ్ళీ గిల్లలేక పోయాననే కసివల్ల కొంత, కల్గింది గాని, నొప్పివల్ల కలగలేదు. బస్సు బయలు దేరింది.

మళ్ళీ గిల్లబోయాడు. కూర్చున్న స్థలం లోంచి కదలలేదు. కదిలితే మునుపటిలాగా కూలబడవలసి వస్తుందని కంటే నిక్కణ్ణుంచి ఎందుకు కదలాలి! నన్నామె గిల్లటమే తనకు జరిగిన ద్రోహం! నేరం!! ఆ నేరానికి ప్రతీకారం చేయటానికి తనిక్కణ్ణుంచి లేచి, ఆమె దగ్గరకు వచ్చి గిల్లపోయే శ్రమ, ఆ శిక్ష అనవసరంగా తన కెందుకు కలగాలి అన్న కోపంవల్ల కదల లేదు.

తల్లి వొళ్ళో వున్న పాప ఏ లోకం లేకుండా పాలు తాగుతూ వుంది. మూడో వాడు అన్నను కొంచెం సేపు తల్లిని కొంచెం సేపు మార్చి మార్చి చూస్తున్నాడు. యువతి గుండె మీద తలపెట్టుకొన్న రెండోవాడు అన్నను ఒకటే యిదిగా చూస్తున్నాడు.

మొదటివాడు ఏడ్పు మానలేదు. ఉష్ అన్నాడు డ్రైవరు. డ్రైవరు చూపుతో కాల్చి పారేద్దామన్నంత కోపంగా చూశాడు పెద్దవాడు.

అంతలో తల్లిని చూశాడు. ఆ డ్రైవరు వల్ల తనకు కలిగిన అవమానానికి కారణం ఆమె అనుకొన్నాడు. వెంటనే కొంచెం పైకి లేచి, ఆమెను గిల్లబోయాడు. చేయి అంద నివ్వలేదు. భుజం అందుతూ వుంది. భుజం మీద కసిగా గిల్లవచ్చు. కానీ గిల్లలేదు.

ఆమె, తల్లిగానీ, మరెవరయినా కానీ, గిల్లింది మోచేతి మీద. ఆమెనూ మోచేతి మీదే గిల్లాలి. అంతేగాని మరొక చోట కాదు. కాగా, నేరం చేసింది కుడిచేయి. ఎడమ చేయి భుజం కాదు. ఏ చేతితో

గిల్లిందో ఆ చేతినే ఎక్కడ గిల్లినదో అక్కడే! అంతే! అన్నట్లుగా వుంది అతని చూపు!

తల్లికీ తతంగం అంతా అవగతపూర్వం కావచ్చు. కుడిచేయి మోచేతి భాగం అందకుండా పెట్టుకొంది. ఎడం మోచేయి మీద పాప తల వుంది. పెద్దవాడు ఆశోపహతుడయి సీటులో కూలబడటం చూచి యువతి గిలుక్కున నవ్వింది.

అంతవరకు ఆమె ముఖం చూడలేదు. ఇప్పుడా నవ్వును బట్టి ముఖం చూశాడు. చూడటం ఎండకాలం— మంటలు మండే, నిప్పులు చెరిగే ఎండకాలం— ఎండలాగా చూశాడు. గాడిపొయి నిప్పు కణికల సెగలాగా చూశాడు. క్షణకాలం బిత్తరపోయి, ఆ చూపుకు అనుబంధం ఏదో స్ఫురించినట్లయి, నవ్వి, నవ్వుతూ అతని వైపు చూచింది. అతని తల వద్దని వారించినట్లుగా కదలబోతుందనిపించి, నప్పుడు కోపంగా చూడటం మానుకొని మామూలుగా కూర్చుంది.

బస్ స్టాప్‌లో సిటీబస్ ఆగి సాగిపోతూ వుంది. ఎండకాలం మధ్యాహ్నం అత్యవసరం అయితే తప్ప ఎవరూ బస్సులో ఉండరు. బయటికి రారు. అందులోనూ నగరం నడిబొడ్డు మీద చారలాంటిది కదా రోడ్డు! జనం చాలావరకు దిగిపోయారు.

మొదటివాడు కూర్చున్న స్థలం వదలకుండా డ్రైవరునూ, యువతినీ కాలుస్తూ చూచి, ఏడ్పుమాని ముందుకు వంగి తల్లి కుడి మోచేయి అందుకోబోయాడు. అందలేదు. కుర్రాణ్ణి చూస్తూ బస్సు నడుపుతున్న డ్రైవర్ మలుపులో, సైకిల్ మీద పోతున్నవాణ్ణి పడగొట్టినట్లనిపించేటట్లుగా గిరుక్కున మలుపు త్రిప్పేసరికి, మలుపు కుదుపుకో, సైకిల్ కుర్రాడేమయ్యాడనో ఎందుకో యువతి ఎగిరిపడింది. ముందుకు చూస్తూ నడుపుతున్న డ్రైవరును, రోడ్డు మీద కులాసాగా చేతులు వదిలి సైకిల్ తొక్కుకు పోతున్న యువకుణ్ణి చూచి, తాపీగా గాలి పీల్చుకొని, వెనక్కు తిరిగి అతనిని చూచింది. అతను చూస్తూ వున్నాడు. కదలిక లేని బొమ్మ!

మొదటివాడు మళ్ళీ తల్లిని గిల్లబోయాడు. ఆ పట్టుదల ఏమిటో అర్థం కాలేదు. కుడి మోచేయి బస్సులో కాకపోతే అన్నం పెట్టేటప్పుడు కాకపోతే, పక్క వేసేటప్పుడు కాకపోతే, పడుకోబెట్టేటప్పుడు కాకపోతే, ఆమె నిద్రపోయిం తర్వాతఅయినా దొరక్కపోతుందా, గిల్లక పోతానా అన్నంత ప్రతీకారంగా కచ్చగా, కసిగా, పగగా చూస్తున్నాడు.


బస్సులో ఉన్న కొద్దిమందికీ ఆ పసివాడి ప్రవర్తన చాలా వింతగా వుంది. యువతి పసివాణ్ణి చూచి చూచి ఆ వింతకు వ్యాఖ్యానం కావలసిన దాని మాదిరిగా అతని ముఖంలోకి చూచింది. ఆమె తనను తనే అడుక్కొని ప్రశ్నకు అతని ముఖంలో సమాధానం శూన్యంగానే వుంది. డ్రైవరు కుర్రవాణ్ణి చూస్తూ వున్నాడు. ఇతను రోడ్డు చూచి బస్సు డ్రైవ్ చేస్తే బాగుండునేమో అనుకొని, అతను చూడని రోడ్డును ఆమె చూస్తూ వుంది.

మొదటివాడు లేచి, తల్లిని గిల్లబోయాడు. కుడి మోచేయి అందినట్లే అందింది. ఆమె వాణ్ణి కొట్టాలను కొన్నట్లు లేదు. చేయి దొరక్కుండా చేసుకోవాలనే అనుకొని వుండవచ్చు. చేయి తీస్తున్నప్పుడు నుదుటికి తగిలి, వుండు మీద కారం చల్లినట్లయి, కచ్చతో రెచ్చిపోయి, అమిత కోపంగా సీటు మీంచి లేవకుండా కుందు కూర్చుని తల్లి జుట్టు రెండు చేతులతో పట్టుకొని, వంచి కుడిచేయి అందుకొని మోచేతి మీద గిల్లబోతున్నాడు. జుట్టు పట్టుకొని, తల వంచినా తల్లికి బాధ లేదు గానీ, చేయి మాత్రం అందకుండా లాక్కుంది.

తల్లి మొండితనం పట్ల యువతికి వళ్ళు మండింది. ఒళ్ళో కూర్చున్న పిల వాణ్ణి ప్రక్కన కూర్చో బెట్టింది. లేచి నలిగిన చీరె కుచ్చెళ్ళు సరి చేసుకొంది. ముందుకు వెళ్ళింది. 'బాబూ!' అంది. మొదటివాడు కోపంగా చూశాడు.

ఆమె ఏమీ మాట్లాడకుండా కుడిచేయి, మోచేయి మొదటివాడి గుండె దగ్గర పెట్టింది. వాడు చేయి చూశాడు. బొద్దుగా ఎర్రగా నున్నగా వుంది. ముఖం చూశాడు. చ్చగా, పగగా, ప్రతీకారంగా, కసిగా నవ్వు ఎన్నట్లుంది.

ఈ చేయి కాదు నన్ను గిల్లింది అనుకో లేదేమో, ఈమెకాదు నన్ను గిల్లింది అనుకో లేదేమో, ఎడం చేతో యువతి కుడిచేయి మోచేతిమీద గట్టిగా పట్టుకొని, మోచేతి పిక్క బిర్రుగా పైకి ఉబ్బితే, ఆమె అంత వయసున్న ఏ స్త్రీ అయినా ఫరవాలేదను



కొన్నాళ్ళుగా కళ్ళు తీసింది, తోటున్న నేల గోరు, మూపుడు వేలు గోరు పోటించి తల వరాలు బిర్రుగా వంకిస్తూ గట్టిగా గిల్లి, వెనక్కు జరిగి సీటు కానుకొని, తాపీగా కూర్చున్నాడు. ఇంకేనా ఇంకా గిల్లుతావా అన్నట్లుగా వాడి ముందే వుం

## స్టాప్

చింది కుడిచేయి. వాడా చేయి మూచి లెక్కలేని తనంతో అవతలకు నెట్టి పారేశాడు.

రెండు గోళ్ళు దిగి మంట పుడుతున్న మా చేయి పిక్క చూచుకొంది యువతి.

పై వంక నెడల్పున గుండ్రంగా గోరు గాయి కనబడింది. గాయి పడినంత భాగంలో పై చర్మం చిట్లింది. రక్తం గూడుకట్టి ఎర్రగా పైకి ఉబికింది. అది చూచుకొంటుంటే ఆమె ముఖం ఎందుకో ఎర్రగా కందిపోయింది. ఎవరివైపూ చూడలేక పోయింది. వణుకుతూ నిలబడింది. అంతలో బస్‌స్టాప్ వచ్చింది. ఆమె నిలవకుండా కుర్రవాణ్ణి చూచి నవ్వి, కుర్రవాడి తండ్రి చూచి—ఎలాగో చూచి—దిగిపోయింది. నెక్స్ట్ స్టాప్ స్టాప్ అంటున్నా వినకుండా దిగిపోయింది. ఆమె దిగిపోవటం. బస్సు బయలుదేరటం, వంచిన తల ఎత్తకుండా ఫుట్‌పాత్ మీద ఆమె నడచిపోతూ వుండటం, ఒక్కసారైనా చూస్తుందేమోనని చూస్తున్న అతనికి నిరాశే అయింది. కళ్ళు చెమ్మగిల్లాయి.

అతను లేచి రెండోవాణ్ణి తీసుకొని, యువతిని గిల్లినవాణ్ణి మొదటివాణ్ణి ఏ వేళ్ళో గిల్లాడో, ఆ చేయి పట్టుకొని, తన సీటు దగ్గరకు తీసుకొనివచ్చి, ప్రక్కనే కూర్చోబెట్టుకొన్నాడు. ఆమె సీట్లో కూర్చున్నవాణ్ణి టక్ నలిగిపోతుందనుకోకుండా ఒళ్లో కూర్చోబెట్టుకొన్నాడు.


తాను దిగవలసిన స్టాప్ వచ్చింది. యువతి దిగవలసిన స్టాప్‌కంటే ఒక స్టాప్ ముందు దిగిపోయింది. తాను ఎక్కిన స్టాప్ కంటే ఒక స్టాప్ వెనుక బస్సెక్కింది ఎందుకో అతని కళ్ళు తడి అవుతూనే ఉన్నాయి.

తల్లి కూతురును చంకలో ఉంచుకొని, మూడోవాణ్ణి చేతో పట్టుకొని బస్సుదిగింది. తండ్రి రెండోవాణ్ణి భుజాన వేసుకొని, మొదటివాణ్ణి చేతబట్టుకొని బస్సు దిగి, భార్య వెనుక నడుస్తున్నాడు.

బస్సు—జీవితం వంటిది — వెళ్ళిపోతూ వుంది. ●

---

రిపోర్ట





### రక్తచందనం

[illegible] —

ఈ చెట్టు పేరు ఎందరికో పరిచయమే. దాని ఉపయోగాలు మాత్రం అందరికీ పూర్తిగా తెలియవు. మన దేశంలో ఆటబొమ్మలు తయారీకి [తిరుపతి చందనం బొమ్మలు], ఇతర చెక్కలకు నగిషీపనులు చేయడానికి విరివిగా ఉపయోగిస్తారు. యూరప్‌లో మాత్రం దీనితో గుడ్డలకి, చర్మాలకి, కర్రలకి [కుర్చీలు, మేజాలు] రంగులువేయడానికి ఉపయోగించుకొంటారు. రక్తచందనం చెక్కలో ఎర్రటి వర్ణపదార్థం ఉంది. దీన్ని సంటాలిన్ అంటారు అంటారు. ఇది ఆల్కహాలులో కరిగిపోతుంది రంగువేయడానికి వీలుగా-ఉంటుంది.

కాని ఇటీవల రక్తచందనం జపానులో వేరే ధంగా ఉపయోగిస్తున్నారు. 'సమిసెన్' అనే వాద్యపరికరానికి ఇదెక్కర అవసరంట. అందమైన గొడుగు కర్రలకికూడా [పట్టుకొనే భాగానికి] ఉపయోగిస్తారు. అదేకాక ఈ కర్ర పెళ్ళి పండగ సందర్భాల్లో పవిత్ర హోమాల్లో ఉపయోగించడం కూడా జరుగుతుంది. దానినుంచి నూనెను తీసి పరిమళ ద్రవ్యాల్లో సువాసనకు కలుపుతారు.

శాస్త్రీయంగా ఈ చెట్టుని టెరోకార్పస్ సంటాలినస్ అంటారు. ఇది రాయలసీమ ప్రాంతాల్లోనే విరివిగా ఉంది. కర్నూలు, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఉన్నప్పటికీ ఎక్కువ కడప జిల్లాలో పెరుగుతోంది. అందులోనూ, చిత్తూరు కడప సరిహద్దుల్లో ఉండే మామండూరు అడవుల్లో సమృద్ధిగా పెరుగుతోంది. దానికి కారణం అక్కడ నేలలో కొన్ని అనుకూల పరిస్థితులు ఉండటమే.

దీనినుంచి లక్షలాదిరూపాయలు విదేశ మారకద్రవ్యం ఆర్జించవచ్చును. టన్నుకు 5 నుంచి 10 వరకు వేల రూపాయల ఆదాయం లభిస్తుంది. కాబట్టి వంటచెరకుగా కొట్టి దీన్ని నష్టపరచకుండా ప్రభుత్వం చాలా జాగ్రత్త పడుతున్నారు. జిల్లా అటవీ శాఖాధికారులు వీరిని పట్టుకోవడం తరుచు పేపర్లో చదువుతూ ఉంటాము. ఆ ప్రాంతాలలో వీటి తోటల విస్తీర్ణం ఎక్కువచెయ్యడానికి కూడా పథకాలు వేస్తున్నారు. ఈ చెట్లు ఉపయోగంలోకి రావడానికి కనీసం 80 ఏళ్ళు పడుతుంది. కాబట్టి దీర్ఘకాల ప్రణాళికలు వేసుకోవాలి. అంతేకాక ప్రత్యేక పరిశోధనలు జరిపి, వాటి ఉన్నత లక్షణాలు పెంపొందింప చేయాలి